# వరంగల్ వాయిస్
*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 91
పేజీలు : 06 | వెల: రూ.5/-
గురువారం
డిసెంబర్ 26, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





8లో..

పుష్పా-2 దర్శకుడు, నిర్మాతలు, హీరోపై..

## తక్షణం కేసులు నమోదు చేయండి

- వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి
- హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ కు వినతి
- సీఎం, సీపీలకు ఉత్తరం పోస్ట్




# ఇందిరమ్మ ఇండ్లకు.. సాంకేతిక సమస్య

- ప్రజాపాలనలో లబ్ధిదారుల దరఖాస్తు
- ప్రస్తుతం యాప్ లో అప్ లోడ్ కానీ వైనం
- సర్వేయర్లకు తప్పని తిప్పలు
- లబ్ధిదారులకు ఇబ్బందులు
- గడువు పెంచాలని డిమాండ్






పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం దరఖాస్తుల అప్ లోడ్ సమస్యలతో అస్తవ్యస్తంగా మారుతోంది. అనేక మంది లబ్ధిదారులు ప్రజాపాలన దరఖాస్తులలో ఇండ్లు లేవని, స్థలం కావాలి అని తమ పత్రాలు సమర్పించినప్పటికీ, డేటా ఎంట్రీ తప్పిదం వల్ల అవి ఆన్ లైన్ సిస్టమ్ లో నమోదు కాకపోవడం, వారి పేరు లిస్టులో, యాప్ లో రాకపోవడంతో నిరుపేదలు ఇబ్బంది పడుతున్నారు. అధికారుల అలసత్వం కారణంగా పథకం ప్రయోజనాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వరంగల్ వాయిస్, దామెర

వివరాలు2లో..



8లో..

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా..

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అట్టహాసంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం
- కాంపౌండ్ నిర్మాణానికి శంకుస్థాపన


2లో..

## ఘనంగా వీర్ బాల్ దివాస్ ర్యాలీ

- గురుద్వారలో ప్రార్థనలు
- సిక్కు బాల వీరులకు జోహార్లు అర్పించిన బీజేపీ నేతలు



## వరి వర్షార్పణం

- బస్తాల్లోనే మొలకెత్తిన ధాన్యం | అయోమయంలో అన్నదాతలు

గత రెండు రోజులుగా వాతావరణంలో అనేక మార్పులు రావడంతోపాటు చిరు జల్లులు కురవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. చేతికొచ్చిన ధాన్యం వర్షార్పణం అయింది. సొసైటీ కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి కాంటా పెట్టారు. అయితే లారీలు లేవన్న సాకుతో ధాన్యాన్ని అక్కడే నిలువ చేశారు. తొర్రూరు పీఏసీఎస్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటాలు నిర్వహించి వారం రోజులు గడుస్తున్నా మిల్లులకు తరలించకపోవడంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తినదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్న వడ్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500బోనస్ వస్తుందని ఆశ పడితే మొదటికే మోసం వచ్చిందంటూ రైతులు వాపోతున్నారు. ఇప్పటికీ మండలంలోని పతేపురం, మాటేడు తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు జరగనేలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– వరంగల్ వాయిస్, తొర్రూరు

# ఇందిరమ్మ ఇండ్లకు.. సాంకేతిక సమస్య



- ప్రజాపాలనలో లబ్ధిదారుల దరఖాస్తు
- ప్రస్తుతం యాప్ లో అప్లోడ్ కానీ వైనం
- సర్వేయర్లకు తప్పని తిప్పలు
- లబ్ధిదారులకు ఇబ్బందులు
- గడువు పెంచాలని డిమాండ్

**వరంగల్ వాయిస్, దామెర :** ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో కొన్ని సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామంది తమ వివరాలు సరిగా అప్లోడ్ కాలేదని తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత దరఖాస్తులు పరిగణనలోకి రాకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

### అప్లోడ్ లోపాలతో లబ్ధిదారుల అవస్థలు..

నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అప్లికేషన్ల అప్లోడ్ సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. దరఖాస్తు చేసిన వారిలో కొందరి వివరాలు ఇంకా సిస్టమ్ లో నమోదు కాకపోవడంతో లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పథకానికి పెద్ద సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, తగిన పత్రాల సక్రమ అప్లోడ్ లేకపోవడం, సాంకేతిక లోపాలు, స్థానిక అధికారుల నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల కొన్ని దరఖాస్తులు ఇంకా డేటాబేస్లో నమోదు కాలేదని తెలుస్తోంది. ఒక లబ్దిదారుడు మాట్లాడుతూ, "మేము అన్ని పత్రాలు సమర్పించాం. కానీ అప్లోడ్ కాలేదని అంటున్నారు. ఇప్పుడు మేము పథకం లబ్దిని పొందలేకపోతున్నాం. ఇది మా లాంటి పేదలకు నష్టం," అని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక కుటుంబాలు పథకానికి అర్హత పొందినా, వారి వివరాలు సిస్టమ్ లో లేకపోవడంతో పథకం ప్రయోజనాలను పొందలేక పోతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు తిరగడం, అధికారుల దగ్గర సపోర్ట్ లేకపోవడం లబ్దిదారులను మరింత అవస్థకు గురి చేస్తోంది. లబ్దిదారులు తమ ఆధార్, రేషన్ కార్డు వంటి పత్రాలు సక్రమంగా సమర్పించిన సంబంధిత అధికారులు అప్లోడ్ చేయకపోవడం ప్రధాన కారణమని తెలుస్తోంది. పత్రాలు అప్లోడ్ కాలేదు అనే కారణంతో వారి దరఖాస్తులు ప్రక్రియలోకి రాకుండా ఆగిపోతున్నాయి.



### సర్వర్ సమస్యతో సర్వేకు కష్టాలు..

గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యతో సర్వే ఆగిపోతుంటే.. పట్టణాల్లో సర్వర్ మొరాయిస్తుండటంతో సర్వే సాఫీగా జరగడం లేదు. ప్రస్తుతం సాంకేతిక సమస్యలతో ఒక్క రోజులో మూడు,నాలుగు కుటుంబాల వివరాలు నమోదు చేయడమే పెద్ద సవాల్'గా మారింది. లబ్దిదారుల గుర్తింపునకు సర్వేయర్లు నేరుగా అర్హుల ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్న నేపథ్యంలో యాప్? లో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వం సర్వే కోసం ప్రత్యేకంగా ట్యాబ్ లు ఇవ్వకుండా సర్వేయర్ల మొబైల్ ఫోన్ లలోనే యాప్ లింక్ ను డౌన్లోడ్ చేయించారు. దీంతో సర్వేయర్లు తలలు పట్టుకుని తిప్పలు పడుతున్నారు. సర్వే చేస్తున్న సమయంలో ఫోన్ రింగ్ కాగానే ఒక్కొక్కసారి సర్వర్ ప్రాబ్లమ్ తో ఆరోజు మొత్తం కూడా సర్వే కానీ పరిస్థితి కొన్ని ప్రాంతాల్లో నెలకొంది. కాగా ఈనెల చివరి వరకు సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన విషయం తెల్సిందే. మరి ఈ క్రమంలో ఈనెల చివరి వరకు సర్వే పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్న అధికారులకు, ప్రస్తుతం యాప్?తో ఎదుర్కొంటున్న ఇబ్బందులతో గడువు పెంచాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

# ఘనంగా వీర్ బాల్ దివాస్ ర్యాలీ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గురు గోవింద్ సింగ్ కుమారులైన తొమ్మిదేళ్ల జోరవర్ సింగ్, ఆరు సంవత్సరాల ఫాతే సింగ్ మొఘల్ రాజుల వ్యతిరేక పోరాటంలో పాల్గొని వీరమరణాన్ని పొందడాన్ని స్మరించుకుంటూ డిసెంబర్ 26 వ తేదీని ప్రధాని నరేంద్ర మోదీ వీర్ బాల్ దివాస్ ను అధికారికంగా ప్రకటించారు. వీర్ బాల్ దివాస్ జిల్లా కన్వీనర్ గోవింద్ సింగ్ ఆధ్వర్యంలో గురువారం కాశిబుగ్గ గురుద్వర ప్రాంగణంలో నిర్వహించిన ర్యాలీలో సుమారు 300 మంది పై చిలుకు సిక్కు, భారతీయ జనతా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం వీర మరణం పొందిన జోరవర్ సింగ్, ఫాతే సింగ్, తదితర సిక్కు బాల వీరులకు జోహార్లు అర్పించి ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర వీర్ బాల్ దివాస్ కార్యక్రమ కో–కన్వీనర్ డాక్టర్ వన్నాల వెంకట రమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమెందర్ రెడ్డి మాట్లాడుతూ.. వీర్ బాల్ దివాస్ యొక్క జీవిత చరిత్రను జిల్లా, మండల స్థాయిలో నిర్వహించేందుకు ప్రధాన మంత్రి తీసుకున్న నిర్ణయాన్ని




స్వాగతిస్తున్నామన్నారు. ప్రతి భారత పౌరుడు జోరవర్ సింగ్, ఫాతే సింగ్ ల బలిధనానికి సంబందించిన యదార్థ గాధను తెలుసుకునేలా చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పాఠశాలల్లో వారం రోజుల పాటు వివిధ సంస్కృతిక కార్యక్రమల రూపం విద్యార్థులందరికీ తెలియచెప్పే దిశగా కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించిన గురుద్వారా పెద్దలకు, కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు.
వీర బాల్ దివాస్ రాష్ట్ర కో–కన్వీనర్ డాక్టర్ వన్నాల వెంకట రమణ మాట్లాడుతూ.. ఔరంగాజేబు మత మార్పిడిలను ధైర్యంగా అడ్డుకోవడంతో మొఘల్ రాజుల ఆగ్రహానికి గురై ధర్మం కోసం, దేశం కోసం సజీవ సమాధి చేయబడ్డారన్నారు. 300 సంవత్సరాల క్రితం బలైన ఈ బాల వీరుల చరిత్రను గత కాంగ్రెస్ ప్రభుత్వం మరుగున పడేసిందన్నారు. ఈ కార్యమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, రఘునరెడ్డి, గడల కుమార్, తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, మంద శ్రీనివాస్, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, పెద్ద ఎత్తున సిక్కు సోదరి సోదరులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మద్య విమోచన కమిటీని పునరుద్ధరించాలి

**మాజీ డైరెక్టర్ దాసి రాందేవ్**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్య విమోచన కమిటీని తిరిగి పునరుద్ధరించాలని ఆ కమిటీ డైరెక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దాసి రాందేవ్ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కోరారు. బెల్ట్ షాపులను అరికట్టడంతో పాటు నాసిరకం మద్యం విక్రయాలను అరికట్టడంలో ఈ ఎంతగానే సేవలు అందించిందని గుర్తు చేశారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కమిటీని రద్దు చేసిందని ఆరోపించారు. దీంతో గల్లీ గల్లీకి బెల్ట్ షాపుల దందా మళ్లీ మొదలైందని ఆరోపించారు. కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రాగానే మద్య విమోచన కమిటీని పునరుద్ధరించాలన్న ప్రతిపాదన ప్రభుత్వానికి వచ్చిందని గుర్తు చేశారు. అయితే ఆలస్యం చేయకుండా మద్య విమోచన కమిటీని పునరుద్ధరించాలని దాసి రాందేవ్ కోరారు. వేం నరేందర్ రెడ్డికి జన్మదినం సందర్భంగా గురువారం హైదరాబాద్ లోని ఆయన ఇంటికి చేరుకున్న దాసి రాందేవ్ పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మద్య విమోచన కమిటీని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని గుర్తుచేశారు.



# రేవంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి.. సక్సెస్ జోడి

- ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కాంగ్రెస్ దిగ్గజ ద్వయం
- తాళ్లూరి బాబు శృతి వనంలో ఘనంగా వేం బర్త్ డే సెలబ్రేషన్స్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** భారీ అంచనాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తోందని తాళ్లూరి బాబు యూత్ అధ్యక్షులు తాళ్లూరి గంగాధర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను డోర్నకల్ మండలంలోని ఉయ్యాలవాడలోని తాళ్లూరి బాబు స్మారక శృతి వనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విప్లవాత్మక మార్పులు, సంస్కరణల కోసం సీఎం రేవంత్ రెడ్డికి అనేక సలహాలు సూచనలు ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనతి కాలంలోనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు, బీఆర్ఎస్ నిలిపివేసిన డీఏలు ఇవ్వడం జరిగిందన్నారు. వచ్చీ రాగానే ఉచిత బస్సు పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఇచ్చి రుణమాఫీ చేసిందన్నారు. వీటికి తోడుగా సన్న బియ్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగానే అమలు చేసిందన్నారు. యూపీఎస్సీ పరీక్ష నిర్వహణ, ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు, హాస్టల్ విస్తృత తనిఖీతో పాటు విద్యార్థులకు మంసాహారం భోజనం అందిస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, సలహాదారుల వేం నరేందర్ రెడ్డి జోడి సూపర్ సక్సెస్ అని తాళ్లూరి గంగాధర్ రావు కొనియాడారు.

# అంతరాలు లేని సమాజమే ధ్యేయం



- ఘనంగా సీపీఐ శతజయంతి ఉత్సవాలు
- రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశ సంపద ప్రజలందరికీ చెందాలని, వర్గ రహిత సమాజ నిర్మాణానికి భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ వంద సంవత్సరాలుగా ఈ దేశ ప్రజలకు స్వతంత్ర ఫలాలు అందాలని సుదీర్ఘ కాలంగా పోరాటాల నిర్వహిస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతజయంతి ఉత్సవాలను వరంగల్ శివనగర్ లో సీపీఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్ లో ఘనంగా నిర్వహించి ఎర్రజెండా ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె.బాష్ మీయా అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సీపీఐ సమ సమాజ స్థాపన కోసం అంతరాలు లేని నవ సమాజ నిర్మాణం కొరకు 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ లోని కాన్పూర్ పుట్టిందన్నారు. దేశవ్యాప్తంగా దున్నేవానికి భూమి కావాలని భూ పోరాటాలు నడిపి పేదలకు లక్షలాది ఎకరాలు భూమి పంచిందని, కులమత తత్వానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా శాంతి కోసం దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచిందని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ప్రాంతంలో నైజాం వెట్టిచాకిరి బానిసత్వం వ్యతిరేకంగా దొరల గడీల నుండి 3000 గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాలను పేదలకు పంచి 4,500 మంది సీపీఐ నాయకులు కార్యకర్తలు రక్త దర్పణం చేశారని అన్నారు. వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు, ఇళ్ల స్థలాలు, పక్కా ఇల్లు నిర్మించుటకు కృషి చేయాలని, యువత ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వం విద్య వైద్యం అందించాలని, అండర్ డ్రైనేజీ, దేవాదుల ప్రాజెక్టు అసంతృప్తిగా మిగిలి ఉన్న దాన్ని పూర్తి చేయుటకు పోరాటాలు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, బుస్స రవీందర్, గుండె బద్రి, సినియర్ నాయకులు కరుణాకర్, ఎండీ అక్బర్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, టి రహేలా, ల్యాదల్ల శరత్, దామెర కృష్ణ, మేడిది అశోక్, సుంకరి భవాని, సౌందర్య, చిట్యాల సువర్ణ, విజయలక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచికి ఆర్థిక సాయం

**త్వరగా కోలుకోవాలని కలకోటి మహేందర్ ఆకాంక్ష**



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని నాగయ్య పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాదాసి సాంబయ్యను గురువారం అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్)అధ్యక్షుడు కలకోటి మహేందర్ పరామర్శించి రూ.2000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కలకోటి మహేందర్ మాట్లాడుతూ నాగయ్య పల్లె గ్రామ మొదటి సర్పంచిగా పనిచేసే గ్రామ అభివృద్ధికి మాదాసి సాంబయ్య సేవ చేశాడని ఆయన కుమారుడు మాదాసి కృష్ణ రెండు పర్యాయాలు వార్డ్ మెంబర్ గా కొనసాగుతూ ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకుడిగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. మాదాసి సాంబయ్య త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, డిఎస్ పి జిల్లా నాయకుడు మాదాసి కృష్ణ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీ తేజ్ ఎంపిక




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీఫ్ మినిస్టర్ కప్-2024లో భాగంగా డిసెంబర్ 21న ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్ బాల్ జూనియర్ బాయ్స్ స్థానిక జవహర్లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగింది. దానిలో దామెర మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన గోవిందు శ్రీతేజ్ పాల్గొని అద్భుతమైన ఆటను ప్రదర్శించి డిసెంబర్ 27 నుంచి 29 వరకు జవహర్ లాల్ నెహ్రూ క్రీడా మైదానం హనుమకొండ జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ జూనియర్ చీఫ్ మినిస్టర్ కప్ 2024 కు ఎంపికయ్యారు. శ్రీ తేజ్ ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోతు జుమ్ము నాయక్, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఫిజికల్ డైరెక్టర్ జెట్టి రాజేశ్వర్, ఆనంద్, ఎక్స్ఎన్ పీటీసీ వేణుగోపాల్, పీఏసీసీ సంతోష్, ఎక్స్ సర్పంచ్ సరస్వతి వెంకన్న అభినందించారు.

# ప్యాకెట్ క్యాలెండర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆల్ షాప్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల సెలవులతో కూడిన 2025 నూతన సంవత్సర ప్యాకెట్ క్యాలెండర్ ను సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గుమాస్తా సోదరులు 2025 సంవత్సరం కార్మికులకు అడ్వాన్స్ గా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిది లేబర్ సెలవులను తప్పనిసరిగా వినియోగించుకోవాలని గుమాస్తా కార్మికులకు తెలియజేశారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతూ అతి తక్కువ వేతనాలతో రోజుకు 12 గంటలు షాపులలో పనిచేస్తున్న పరిస్థితి ఉందన్నారు. పని భద్రత కరువై ఎలాంటి హక్కులు లేకుండా బోనస్, సర్వీసు, ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యాలు లేకుండా యాజమానుల వద్ద వెట్టి చేస్తున్న పరిస్థితి



ఉందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. షాపులలో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి గుర్తింపు లేదని లేబర్ అధికారులు తనిఖీ చేసి ప్రతి కార్మికుడికి ఎస్ ఫామ్ ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమారు, శంకర్, సీహెచ్ రాజు, కుంట యాదగిరి, దానం కుమార్, ఇనుముల సుధాకర్, పి.వెంకట్, జంగా రాఘవరెడ్డి, ఏ.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐపై దాడి హేయమైన చర్య

**ట్రెంగా జిల్లా అధ్యక్షుడు భూక్య కస్నా నాయక్**



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని (కాప్రా) రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రమేష్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ట్రెంగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు భూక్య కస్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వ భూమిని పరిరక్షిస్తుండగా ఆర్ఐపై దుండగులు దాడికి పాల్పడడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ధ్యాన్ చంద్ హాకీ క్లబ్ టీంకు సోదా రామకృష్ణ అభినందనలు



**వరంగల్ వాయిస్, పరకాల :** సీఎం కప్ టోర్నమెంట్ లో భాగంగా గురువారం సీఎం కప్ రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ కు సెలెక్ట్ అయి బయలుదేరుతున్న పరకాల ధ్యాన్ చందు హాకీ క్లబ్ కు చెందిన ఏడుగురు జాతీయ హాకీ క్రీడాకారులు హాకీ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సోదా రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 27, 28, 29 ఈ మూడు రోజులు హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగబోయే రాష్ట్రస్థాయి సీఎం కప్ హాకీ టోర్నమెంట్ కు హనుమకొండ హాకీ జట్టులో ఏడుగురు జాతీయ క్రీడాకారులు పరకాల ధ్యాన్ చందు హాకీ క్లబ్ కు చెందిన వారు కాబట్టి గర్వంగా ఉంది. వారు హైదరాబాద్ కు బయలుదేరే ముందు హనుమకొండ హాకీ జిల్లా అధ్యక్షుడు సోదా రామకృష్ణను కలవగా వారు వారిని అభినందిస్తూ ఎల్లవేళలా క్రీడాకారులకు అందుబాటులో ఉంటూ నా సహాయ సహకారాలు అందిస్తానని, క్రీడల్లో ప్రతిభ కనబరిచి హనుమకొండ జిల్లాకు సీఎం కప్పు తీసుకువచ్చి మంచి పేరును తీసుకురావాలని కోరడంతో పాటు హాకీ టీంకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధ్యాన్ చంద్ హాకీ క్లబ్ టీం బొజ్జం రాకేష్, నరేష్, నాగార్జున, రత్నాకర్, క్రాంతి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎస్ఐలు బదిలీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్పెషన్ బ్రాంచ్ ఎస్ఐగా పని చేస్తున్న బి.మాధవ్ తో పాటు, ఏనుమాముల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్న పి.శ్రీకాంత్ లను హనుమకొండ పోలీస్ డివిజన్ పరిధిలోని కేయూసీ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల



**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం నడికూడ మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు మురాల సుజాత సుధాకర్ రావుల కుమార్తె ప్రత్యూష-నితిస్ సాయి కృష్ణల వివాహానికి గురువారం హాజరై నూతన వధూవరులను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్ రావు, కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

### మండలాధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని బూత్ లలో జెండా ఆవిష్కరించి విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ పిలుపునిచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించు పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి అన్ని బూత్ లకు సంబంధించిన అధ్యక్షులతో పాటు మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెంది 11వ వార్డుకు చెందిన కక్కర్ల సమ్మయ్య కుటుంబానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య బియ్యం అందజేశారు. గత 30 సంవత్సరాలుగా కొనసాగుతున్న నిరంతర ప్రక్రియలో భాగంగా మృతుడి కుమారుడైన కక్కర్ల హరికృష్ణకు 75 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ వార్డ్ నెంబర్ జంజీరాల మనోహర్, సత్తయ్య, సంపత్, సంతోష్, ఉపేందర్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రజకులను మరింత చైతన్యవంతం చేస్తా



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రఘునాథపల్లి మండల అధ్యక్షుడిగా కంచనపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఓరుగంటి మనోహర్ ను నియమిస్తూ గురువారం రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక ప్రకటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రజకులు రాజకీయంగా ఆర్థికంగా మంచి స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. అనంతరం మండల నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి, జనగామ జిల్లా అధ్యక్షులు ఎదునూరి నరేష్, ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే గ్రామాల్లో పర్యటించి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన వివరించారు.

## 13వ డివిజన్ లో అక్రమ నల్లా కలెక్షన్లు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ దేశాయిపేట, ఎంహెచ్ నగర్ లో అక్రమంగా నల్ల కలెక్షన్లు, అక్కడ ఇల్లు లేకున్నా ఏకంగా రెండు నల్లా కలెక్షన్లు ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు మున్సిపల్ పర్మిషన్ లేకున్నా, హౌస్ నెంబర్లు లేకున్నా మున్సిపల్ సిబ్బంది నల్ల కలెక్షన్లు ఇచ్చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు ఇవన్నీ చూసి చూడనట్టు వదిలేస్తున్నారు. పలుసార్లు ప్రజాప్రతినిధులకు, మున్సిపల్ సిబ్బందికి మొరపెట్టుకున్నా పట్టించుకోవట్లేదని స్థానిక ప్రజలు అంటున్నారు.

# ఆలయంపై రాజకీయమా ?

### ➲ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఆలయంపై రాజకీయం సరికాదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే, ఆలయ ధర్మకర్త, చైర్మన్ గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంజూరు నగర్ లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న రమణా రెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి, మంజూరు నగర్ నందు లోక కళ్యాణం కొరకు, భక్తుల దర్శనార్థం సంవత్సర కాలంలోనే శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించి, మూల విరాట్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రతిష్టించుకున్నామని తెలిపారు. ఈ సంవత్సర కాలంలో తిరుమల తిరుపతిలో స్వామి వారికి జరుగుతున్న కైకార్యాలను ఏ లోటూ లేకుండా ప్రతి రోజూ ఇక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు. మనం ఈ రోజు ఉన్న ఈ ప్రాంగణం ఎంతో చరిత్రను సంతరించుకోనుందని, ఈ ఆలయంలో రాజ గోపురం, ఉత్తర ద్వారం, యాగశాల, చుట్టూ ప్రహరీ గోడ, పాకశాల నిర్మాణం పనులు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే కొంత మెటీరియల్ కూడా వచ్చింది. వేరే ఆలయం దగ్గర నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో ఇక్కడి ఆలయ నిర్మాణ శిల్పులు అక్కడి వెళ్లారని తెలిపారు. మళ్లీ సంక్రాంతి వరకు ఇక్కడ మిగిలిన నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు కొంచెం సమయం పడుతుందన్నారు. ఈ ఆలయాన్ని ఎండోమెంట్ కు అప్పగించాలని, స్థానిక శాసనసభ్యులు సదరు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసిందన్నారు. అయితే ఆలయానికి సంబంధించి కొన్ని పనులు జరుగుతున్న నేపథ్యంలో పనులు పూర్తయిన తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానం వారికి ఆలయ నిర్వహణ బాధ్యతలు అప్పగించే ఆలోచన ఉందని అన్నారు. ఒకవేల కుదరకపోతే ఎండోమెంట్ కే అప్పగిస్తామన్నారు. అయితే ఆలయానికి సంబంధించిన కొన్ని పనులు మాత్రం పూర్తి కావాలన్నారు. అదేవిధంగా అధికారమనేది శాశ్వతం కాదని దేవుని ఆశీర్వాదం, ప్రజల నిర్ణయం మేరకు ఉంటుందన్నారు. ఆలయాన్ని తను కమిట్ మెంట్ తో కట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఆలయం పూర్తయ్యేంత వరకు కొంత సమయం ఇవ్వాలని, గుడికి సంబంధించి తన వ్యవహార శైలి ఈ విధంగానే కొనసాగిస్తామని అనుకుంటే వారి విచక్షణకు వదిలేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడి చేతిలో వజ్రాయుధం ఆర్టీఐ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చింతల రాఘవేందర్ ముదిరాజ్ ను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్.చంటి ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతో పాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతీ నుండి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని, దుర్వినియోగం చేయకూడదని, అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్యానిర్వాహాక అధ్యక్షులుగా ఎన్నికైన చింతల రాఘవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెన్నెముక అయిన సమాచార హక్కు చట్టం 2005 కు సంబందించిన 4 (1) బి సంబంధించిన 17 అంశాల సమాచారం, రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 న గల కాపీలను ఉచితంగా, స్వచ్ఛందంగా ప్రజలకు కోరినప్పుడు అధికారులు ఇవ్వాలని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు జి.ప్రియా రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధి రాసునూరి లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మాదగోని సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు బేసిక్ పే వేతనం అమలు చేయాలి

### ▪ రామ రాజేష్ ఖన్నా డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ 78 క్యాడర్లలో సుమారు 17,541 మంది పనిచేస్తున్నారని, వారందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేసి రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ పే అమలు వెంటనే అమలు చేయాలని, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. 25 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రజల కాపాడటంలో ప్రాణాలను అత్యంత కీలక పాత్ర జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు పోషిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన పీఆర్సీ బకాయిలు 7 నెలల వెంటనే చెల్లించాలని, ఎన్ హెచ్ఎంలో 78 క్యాడర్స్ ఉద్యోగులకు 30 శాతం వెయిటేజ్ వర్తింపజేయాలి, హెల్త్ కార్డ్స్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎన్ హెచ్ఎం ఉద్యోగులందరికీ సంవత్సరానికి 35 రోజుల క్యాజువల్ లీవ్స్ మంజూరు, మహిళ ఉద్యోగస్తులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న ఖాళీలను ఎన్ హెచ్ఎం ఉద్యోగులతో భర్తీ చేయాలని, ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలనీ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంలో ఉద్యోగుల సమస్యల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని, వెంటనే ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని, అలాగే 510 జీవోలో నష్టం జరిగిన 4000 మంది ఉద్యోగులకు ఒక కొత్త జీవో రిలీజ్ చేసి ఉద్యోగులకు బ్రతుకుల్లో వెలుగులు నింపాలని, సంఘ నాయకులను పిలిచి సమస్యలు నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడించాలని కోరారు.

# ఆర్థిక అక్షరాస్యత, సైబర్ క్రైంపై అవగాహన అవసరం

## ● ఎస్ బీఐ బ్యాంక్ మేనేజర్ మోహన్ కాంత్




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రంలో శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో గురువారం రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా వారి సహకారంతో స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు, వ్యాపారులకు, యువకులకు, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య యూబీఐ లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్ సీ వరంగల్ జిల్లా కౌన్సిలర్ భాస్కర చారి హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అందరు ఆర్థిక అక్షరాస్యతపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, సామాజిక భద్రత పథకాలైన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సిబిల్ స్కోర్, సుకన్య సమృద్ధి యోజన, పీఎంఈజీపీ, ఎన్ బీఎఫ్ సీ, ఫిక్సిడ్ /టర్మ్, డిపాసిట్ అకౌంట్స్, రిక్యూరింగ్ డిపాజిట్ అకౌంట్, కరెంట్ అకౌంట్స్, బీఎస్ బీడీ, టాక్స్ లిబిలిటీ అఫ్ ఎఫ్ఢి / ఆర్డి ఆకౌంట్స్, అకౌంట్ ఓపెనింగ్ అండ్ హౌ టూ డూ ట్రాన్సక్షన్స్, కేవైసీ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఈ–వాల్లేట్స్, యూపీఐ/ యూఎస్ఎస్ డి/ ఎఈపీఎస్, లాకర్ ఫెసిలిటీ, లోన్ ఫెసిలిటీ, గవర్నమెంట్ స్కిమ్స్, సబ్సిడీ, గ్రీవెన్సీ రిడ్రస్స, ఆర్బీఐ ఓఎస్, 2021, పేమెంట్స్ అండ్ సెటిల్మెంట్స్ ఇన్ ఇండియా, ఎన్ఈఎఫ్ టీ, ఆర్ టీజీఎస్, ఐఎంపీఎస్, బీబీపీఎస్, ఎన్ఈటీసీ ఫాస్ట్ టాగ్ పథకాలపైన పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం చెన్నారావుపేట ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ మోహన్ కాంత్, పోలీస్ కానిస్టేబుల్స్ శ్రీ కృష్ణ, వెంకటరామ్ మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల ఖాతాదారులందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ శాఖ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1930 గుర్తుపెట్టుకోవాలని, డబ్బు సంపాదించుకోవడం ఎంత ముఖ్యమో, దాచుకోవడం ఎంత ముఖ్యమో, కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. బ్యాంకు సంబంధిత ఓటీపీ, పిన్, వ్యక్తిగత అకౌంట్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని, లింకులను నొక్కడం ఫార్వర్డ్ చేయడం చెయ్యకూడదన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత పోస్టులు పెట్టేముందు చాలా వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు గోల్డెన్ అవర్ ను గుర్తుకు చేసుకొని వెంటనే 1930 నెంబర్ కి ఉచితంగానె కాల్ చేసి న్యాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాజి జడ్పీటీసీ జున్నుతాల రాంరెడ్డి, ఎస్ బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వజర్ గణేష్, సంస్థ ఫీల్డ్ కో'ఆర్డినేటర్ ఈదునూరి రమేష్, ప్రాజెక్ట్ కోర్డినేటర్ ముబీన్ ఖాన్, మహిళా సంఘ ప్రతినిధులు, వీఓలు మమత, సరోజ, యమున, స్పందన, సంస్థ ఫీల్డ్ అఫీసర్స్ సౌజన్య, కీర్తన, కళాకారులు సాంబరాజు, రాజేందర్, స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, యువకులు, వ్యాపారులు, బ్యాంక్ ఖాతా దారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


# పంట రక్షణ కంచెలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వొద్దు

## ఎన్పీడీసీఎల్ ఏఈ చందూలాల్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రైతులు తాము పండించిన పంటలను అడవి పందుల బెడద నుండి కాపాడుకోవడానికి పంట చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి, 11 కువీ విద్యుత్ వైర్ల నుండి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారని, ఇది ప్రమాదకరమని, కనెక్షన్ ఇవ్వవద్దని ఎన్పీడీసీఎల్ ఏఈ చందులాల్ తెలిపారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో గురువారం 11కేవీ విద్యుత్ వైర్లకు పంట రక్షణకు అక్రమ కనెక్షన్ వేసుకున్న వైర్లను గుర్తించి సిబ్బందితో వైర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్న పంటలను అడవి పందుల బెడద నుండి కాపాడుకోవడానికి పంట చుట్టూ ఇనుప తీగలతో కంచె ఏర్పాటు చేసి 11కేవీ విద్యుత్ వైర్ల నుంచి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారని, అడవి పందులు తాకగానే విద్యుత్ ప్రమాదంతో అవి మరణిస్తున్నాయని, వెంటనే విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లో విద్యుత్ క్రమబద్ధీకరణకు వచ్చే విద్యుత్ సిబ్బంది కూడా ప్రమాదాల బారిన పడే సంఘటనలు ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలలో విద్యుత్ ప్రమాదాలు జరిగితే విద్యుత్ శాఖకు ఎలాంటి సంబంధం ఉండదని హెచ్చరించారు. రైతులందరూ సహకరించి విద్యుత్ మెయిన్ వైర్ల నుండి అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని, విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ కోరారు.

# త్వరిత గతిన ధాన్యాన్ని తరలించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్నటువంటి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని ఏఐకేఎస్ అనుబంధం తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చింతలపల్లి, ఖానాపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మూడు నెలలు అవుతున్నా అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇంకా కోనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం ఉందన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి త్వరిత గతిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు.

# మార్క్సిస్టు సిద్ధాంతమే సోషలిజానికి పునాది



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** నేడు దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఫాసిస్టు రూపాన్ని ప్రదర్శిస్తూ 99 శాతంగా ఉన్న పీడిత కార్మిక వర్గాన్ని, అసంఘటిత, సంఘటిత రంగాల్లో కష్టజీవులుగా శ్రమిస్తున్న కార్మిక వర్గ శ్రమ శక్తిని దోచుకుంటుందని బీకేఎంయూ జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి, బీసీ హక్కుల ఉద్యమ నేత నేదునూరి రాజమౌళి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమజీవులంతా ఐక్యమై మార్క్సిస్టు సిద్ధాంతమే ఆయుధంగా సామాజిక న్యాయం, సోషలిజం సాధన దిశగా వర్గ, వర్ణ నిర్మూలనోద్యమాలు విజయవంతం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. గురువారం హసన్ పర్తి మండలం మడిపల్లి గ్రామంలో జక్కుల సాంబరాజు అధ్యక్షతన శాఖ సమావేశం జరుగగా సమావేశానికి హాజరై మాట్లాడుతూ స్వరాజ్యం వచ్చి 77 ఏళ్లు గడిచినప్పటికీ పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనవంతులుగా మారడానికి పాలకవర్గాలు దోపిడి వర్గాలకు దోచి పెట్టారని మండిపడ్డారు తప్ప కార్మిక వర్గానికి, రైతాంగానికి ఒరగబెట్టింది ఏమీ లేదని తెలిపారు. దేశంలో రైతు కూలీ రాజ్యం నిర్మాణానికి కమ్యూనిస్టు పార్టీలు, సామాజిక సంఘాలు, ప్రజా సంఘాలు, నిరంతర పోరాటాలు నిర్వహించడం దేశ పరిణామ క్రమంలో సీపీఐ పాత్ర అమోఘమైనదన్నారు. ప్రజల తక్షణ అవసరాలు తీరడానికి సంక్షేమ పథకాలు అమలు కొరకై పోరాడుతూనే మహత్తర లక్ష్యమైన సోషలిజం కోసం ప్రజాస్వామిక ఐక్య కమ్యూనిస్టు సామాజిక ఉద్యమాల ఆవశ్యకత అనివార్యమన్నారు. ఈనెల 27న హనుమకొండ వెయ్యి స్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు జరిగే ప్రజా ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 29న హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో సీపీఐ 100 సంవత్సరాల వార్షికోత్సవాలను సీపీఐ కార్యాలయ ప్రారంభోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా వాజపేయి జయంతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారి వాజపేయి జయంతొి సందర్భంగా మాజీ శాసనసభ్యుడు, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో 150 మంది పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. మార్తినేని ధర్మారావ్ మాట్లాడుతూ దేశాన్ని పరిపాలించిన నాయకులలో వాజపేయి అగ్రగామిగా నిలుస్తారన్నారు. ఈ సందర్భంగా వాజపేయికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బింగి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించగా 8వ డివిజన్ కార్పొరేటర్ బైరీ లక్ష్మి, బీజేపీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు పాశికంటి రాజేంద్రప్రసాద్, బీజేపీ నాయకులు కొత్త రవి, చిందం సుధీర్, బాబు రావు, శనిగరం విజయ్, దొంతుల వాసుదేవ రెడ్డి, బింగి లక్ష్మణ్, గండు స్వామి, పాత శృతి, శంకర్, రామ శ్రీధర్, సాగర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి కాలానికి ముందస్తు చర్యలు

## హనుమకొండ ఎస్ ఈ వెంకట రమణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాబోవు వేసవి కాలానికి విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని హన్మకొండ సూపరిండింగ్ ఇంజినీర్ కె.వెంకట రమణ తెలిపారు. గురువారం హనుమకొండలోని న్యూ శాయంపేట సబ్ స్టేషన్ లో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ నుంచి 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ కు పెంచామన్నారు. ఇది వరకు 8ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ తో పాటు ఇది అదనంగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. దీంతో మొత్తం 16 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ ల సామర్ధ్యం పెరిగిందని చెప్పారు. ఈ పవర్ ట్రాన్స్ ఫార్మర్ పెంచడం వలన వేసవిలో లోడ్ ఎంత పెరిగిన ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ టౌన్ డీఈజీ సాంబరెడ్డి, ఏడీఈ పి.మల్లికార్జున్, జానకి రాంరెడ్డి, దర్శన్ కుమార్, ఏఈ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే సహకారాన్ని మరచిపోం

## హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌజింగ్ సొసైటీ నూతన బాధ్యుల కృతజ్ఞతలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వారం రోజుల క్రితం హోరా హోరీగా జరిగిన సొసైటీ కార్యవర్గ ఎన్నికల్లో తమ ప్యానల్ కు సంపూర్ణ మద్దతునిచ్చి, గెలుపుకు కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే)కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్ కో–ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ నూతన బాధ్యులు పేర్కొన్నారు. గురువారం ఆ సొసైటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులు గోపరాజు, రవీంద్రబాబులు బషీర్ బాగ్ లోని టీయూడబ్ల్యూజే కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీని మర్యాదపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. తమపై సంఘం ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా సొసైటీ సభ్యులకు న్యాయం చేసేందుకు అవిశ్రాంతంగా శ్రమిస్తామని హామీ ఇచ్చారు. తమకు యూనియన్ సలహాలు, సహకారం అవసరమని వారు కోరగా, ట్రేడ్ యూనియన్ స్ఫూర్తితో పనిచేస్తూ ముందుకెళ్లాలని విరాహత్ అలీ వారిని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ కూడా పాల్గొన్నారు.

## ఘనంగా సుపరిపాలన దినోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ కాశిబుగ్గ ఆధ్వర్యంలో మహానేత, భారతీయ రాజకీయాల్లో స్ఫూర్తిదాయక నాయకుడైన అటల్ బిహారి వాజపేయ్ జయంతి శతాబ్ది సందర్భంగా గురువారం సుపరిపాలన దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక సందర్భంలో సమైక్య వాక్ ఫౌండేషన్ (వన్నాల వెంకటరమణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని 20, 21వ డివిజన్ల శానిటైజేషన్ సిబ్బందికి, మున్సిపాలిటీ సిబ్బందికి దుప్పట్ల పంపిణీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ హాజరయ్యారు. అలాగే బీజేపీ వరంగల్ జిల్లా పార్లమెంట్ కంటెస్టెంట్ ఆరూరి రమేష్, ప్రదీప్ రావు, కొండేటి శ్రీధర్, ఎడ్ల అశోక్, సీనియర్ నాయకులు సముద్రాల పరమేష్, వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, తిరుపతి రెడ్డి, రఘునాథ రెడ్డి, గాడిపెల్లి రాజేశ్వరరావు, వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు మార్టిన్ లూథర్, జిల్లా కార్యదర్శి గోకె వెంకట్, మహేష్(ఓబీసీ అధ్యక్షులు), సిద్ధం నరేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు భరత్వీర్, బీజేపీ వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రతన్ నోముల, 21వ డివిజన్ అధ్యక్షులు కోమాకుల నాగరాజు, 19వ డివిజన్ అధ్యక్షులు కట్టర్ సతీష్, కందుకూరి శ్రీనివాస్, కొంతం సంగీత్, భాస్కర్ గారు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీబీఎం ఎలక్ట్రికల్ బైక్ షోరూం ప్రారంభం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సూర్య మోటార్స్ వారిచే వరంగల్ జిల్లా బీబీఎం ఎలక్ట్రికల్ బైక్ షోరూం పోతన రోడ్డులోని సూర్య బార్ ఎదురుగా ముహూర్తం పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభించారు. కంపెనీకి సంబంధించిన బండ్లను అందుబాటులో తెచ్చే ప్రయత్నంలో సూర్య మోటార్స్ వారు ఉన్నారు. మిత్రులు శ్రేయోభిలాషులు బీబీఎం కుటుంబ సభ్యులు అందరూ కూడా సహకరించాలని శ్రీరాముల సురేష్, వాడిక సతీష్, మొకిడా సుధాకర్ కోరారు. పర్యావరణాన్ని కాపాడుదాం.. పెట్రోలు ఖర్చును వదిలేద్దామనే నినాదంతో ప్రతి ఒక్కరు ఉండాలన్నారు.

## పర్యావరణ సంరక్షణపై అవగాహన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌లోని యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ (UFEP) ఆధ్వర్యంలో ఆ సంస్థ జనరల్ బాడీ మీటింగ్ సందర్భంగా పర్యావరణ సంరక్షణపై అవగాహన కార్యక్రమం హనుమకొండ జిల్లా, హసన్‌పర్తి, సంస్కృతి విహార్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ జిల్లా అటవీ అధికారి ఖాజీపేట పురుషోత్తం అధ్యక్షత వహించగా, పోలోజు కృష్ణమాచార్య (డీఎఫ్ఓ, ఫ్లైయింగ్ స్క్వాడ్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పోలోజు కృష్ణమాచార్య మాట్లాడుతూ, వరంగల్ తెలంగాణ రాష్ట్రంలోని ఒక చారిత్రక నగరమని, ఇది తన సాంస్కృతిక వారసత్వం మాత్రమే కాకుండా అడవులు, సరస్సులు, వన్యప్రాణులతో కూడిన ప్రకృతి సంపదకు ప్రసిద్ధి చెందినదని చెప్పారు. అయితే, ఇతర పట్టణాల మాదిరిగానే వరంగల్ కూడా అడవుల తొలగింపు, నీటి కాలుష్యం, పట్టణీకరణ ప్రభావాల వంటి పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదను కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ కార్యవర్గ సభ్యులు పొన్నాల రామ్మోహన్, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్,కె. అనితారెడ్డి, మాజీ జిల్లా అటవీ అధికారి ఖాజీపేట పురుషోత్తం, టి. శ్రవణ్ కుమార్, మండల పరశురాములు, డి. రాజగోవింద్, వి. సుధాకర్ స్వామి, టి. నాగేశ్వరరావు, పి. రాజ్ కుమార్, పిట్టల రవిబాబు, వి. శ్రీనివాస్, జి. నటేష్, ప్రకాష్, డా. రాములు, ఎమ్.డి. సిరాజుద్దీన్, పెండ్లి ఉపేందర్ రెడ్డి, మల్లారెడ్డి దామోదర్, కమలాకర్ స్వామి, లక్ష్మీన్న, ప్రసన్న పాల్గొన్నారు.

# డబుల్ రోడ్డుగా మార్చండి

- పర్వతగిరి నుంచి రెడ్లవాడ వరకు ఇరుకైన రోడ్డు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు, బాటసారులు
- ఎమ్మెల్యే నాగరాజు చొరవ చూపాలని వేడుకోలు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని ఇస్లావత్ తండా మీదుగా నెక్కొండ మండలంలోని రెడ్లవాడ గ్రామానికి వెళ్ళేందుకు ఆరు కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో భూక్యా తండా, ధరంసోత్ తండా, మూడు తండా, మంగలిబోడు తండా, మూడు బీచార్య తండాలు ఉన్నాయి. దశాబ్దాల పాటు అభివృద్ధికి నోచుకోని గిరిజన తండాలు అవి.. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే వారు గుర్తుకు వచ్చి అది చేస్తాం ఇది చేస్తాం అని చెప్పి గెలిచిన తరువాత ఏ నాయకుడు కూడా అటు వైపు కన్నెత్తి చూడరు. అయితే తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత సైతం గిరిజన తండాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. వానొస్తే కనీసం నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో తమ తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గత బీఆర్ఎస్ పార్టీ నాయకులను కలిసి గిరిజనులు విన్నవించారు. అనేక సందర్భాల్లో ప్రజా ప్రతినిధులను కలిసి మొర పెట్టుకున్నారు. చివరికి 2018-19 సంవత్సరంలో ప్రత్యేక అభివృద్ధి పథకం కింద గ్రామీణ రహదారుల నిర్మాణ పథకం కింద నిధులు విడుదల చేశారు. ఇందులో భాగంగా పర్వతగిరి మండలంలోని హిందూ శ్మశాన వాటిక మూల మలుపు నుంచి ఇస్లావత్ తండా గ్రామం మీదుగా నెక్కొండ మండలంలోని రెడ్లవాడ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వరకు, అలాగే ఇస్లావత్ తండా నుంచి దౌలత్ నగర్ గ్రామం వరకు సింగిల్ రోడ్డు మంజూరు చేసి పనులు పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. కానీ ఇప్పుడు రవాణా






వ్యవస్థ మెరుగుపడడంతో రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. లో లెవెల్ కాజ్ వే పూర్తిగా దెబ్బతినడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

### సింగిల్ రోడ్డుతో ప్రమాదాలు..

వరంగల్ జిల్లా నుంచి మహబూబాబాద్ జిల్లాకు వెళ్లేందుకు తక్కువ దూరం ఉన్న రహదారి ఇది. రేయింబవళ్లు కార్లు, ఆటోలు, లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగిస్తున్నాయి. అయితే సింగిల్ రోడ్డు మూలంగా అనేక మంది ప్రమాదాల బారిన పడి గాయపడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకుండా ఉండడం, మూలమలుపులు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయ్యగారి కుంట, బంజరు దొడ్డి వద్ద మూలమలుపుతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కుంట కట్ట ఇరుకుగా ఉండడం వల్ల గతంలో ఓ వీఆర్ఏను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిన రోడ్ల అభివృద్ధిని, ప్రస్తుత ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక దృష్టి సారించి సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు కృషి చేయాలని తండా వాసులు కోరుతున్నారు. అలాగే సంబంధిత శాఖ అధికారులు స్పందించి పర్వతగిరి మండలంలోని ఇస్లావత్ తండా మీదుగా నెక్కొండ మండలంలోని రెడ్లవాడ గ్రామానికి వెళ్ళే రోడ్డుపై ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని గిరిజనులు వేడుకుంటున్నారు.అలాగే వరంగల్ నుంచి మహబూబాబాద్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సామాన్యుడి బాధలను కథల్లోకి ఒంపిన దేవులపల్లి వాణి

- నల్సార్ యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ డాక్టర్ కృష్ణ దేవరావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రచయితల సంఘం, వరంగల్ ఆధ్వర్యంలో గురువారం కవి, రచయిత్రి డాక్టర్ వాణీ దేవులపల్లి కథాసంపుటి నుమాయిష్ ఆవిష్కరణ సభ వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల సెమినార్ హాల్, నయీంనగర్, హనుమకొండలో ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. శ్రీనివాసరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ వాణి కథలలో స్థానిక భాష వాడడం పాఠకులను ఆకట్టుకుందని అన్నారు. ముఖ్య అతిథి, ఆవిష్కర్త నల్సార్ యూనివర్సిటి వైస్ ఛాన్సలర్, డాక్టర్ కృష్ణ దేవరావు మాట్లాడుతూ రచయిత్రి జీవితంలో తాను విన్నవి, చూచినవి, అనుభవంలో తెలుసుకున్నవి తనలో కలిగించిన సంవేదనలు, సంచనాలు, ఆలోచనలను చాలా చక్కగా కథల రూపంలో వెలువరించిందన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన సింగరాజు రమాదేవి మాట్లాడుతూ వాణీ కథలలో తెలంగాణ అస్తిత్వ చైతన్యం స్పష్టంగా కనబడుతుందని, తెలంగాణ గ్రామీణ జీవనాన్ని, పలుకుబడులను కథలన్నింటిలో బాగా పొందుపరిచిందన్నారు. గౌరవ అతిథి, ప్రధాన వక్త ప్రముఖ సాహితీవేత్త గిరిజా మనోహర బాబు మాట్లాడుతూ రచయిత్రికి మానవ సమాజంలోని మానవ సంబంధాలపట్ల, సామాజిక అభివృద్ధిపట్ల ఉన్న గౌరవభావం దాదాపు ప్రతి కథలోనూ కనిపిస్తుందన్నారు. సభలో కవి బిల్ల మహేందర్, నెల్లుట్ల రమాదేవి, డా. ప్రవీణ్, డా. అశ్విన్, మండువ సతీష్, వంశీ, సన్ని మాట్లాడారు. కార్తీకరాజు, సంపత్ రావు, అస్నాల శ్రీనివాసు, మేకిరి దామోదర్, రాంబ్రహ్మాచారి, రత్నమాల, విద్యాదేవి, వెల్దండి లీల, మండుల ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



గడ్డం
కేశవమూర్తి

- ప్రజా పోరాటాలే ఊపిరి
- వామపక్ష భావ జాలం ఆయన నైజం
- కాంగ్రెస్ పార్టీలో రాజకీయ జీవితం
- నేటి రాజకీయం మారాలి
- చివరి శ్వాస వరకు ప్రజా జీవితమే

ప్రజా పోరాటాలే ఆయన ఊపిరి.. నిరుపేదల, రైతు కూలీల పక్షాన నిలవడం ఆయన నైజం.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై నిష్పక్షపాతంగా పోరాటం చేయడంలో ముందుండే తత్వం ఆయనది.. ప్రజల పక్షాన ఉంటూ వామపక్ష భావజాలంతో భూమి లేని నిరుపేదల కోసం దండు కట్టి, రైతు కూలీల రేట్లు పెంచాలని, భూస్వాముల మిగులు భూములు పేద ప్రజలకు పంచాలని అలుపెరుగని పోరు సలిపిన ప్రజా నాయకుడు ఎనగందుల మురళి. ఎస్ఎఫ్ఐలో మొదలైన తన రాజకీయం జీవితం ఎన్నో ఎత్తుపల్లాలను చూసింది. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజా సేవకు తన జీవితం అంకితం చేసిన మురళిది నిరాడంబర జీవితం. పేద ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోయడానికి సిద్ధపడిన ప్రజా సేవకుడు. పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది.. అనే కాళోజీ కవితకు ఎనగందుల మురళి జీవితం సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.









# ప్రజా సేవకుడు..
# ఎనగందుల మురళి





ఖమ్మం జిల్లా గోకినేపల్లి లో సమ్మర్ హాలిడేస్ లో తెలంగాణ స్థాయి ఎస్ఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులు ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చాయి. ఎస్ఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతుల్లో మోటూరి హనుమంతరావు, పస్రా సత్యనారాయణ, తమ్మినేని వీరభద్రం, ఏపీ విటల్, బీమిరెడ్డి నర్సింహారెడ్డి లాంటి నాయకులు పరిచయమ్యారు. ముఖ్యంగా వారు చెప్పిన గతితార్కిక, చారిత్రిక, భౌతిక వాదం తరగతులు ఎనగందుల మురళిను బాగా ప్రభావితం చేశాయి. సమాజం ఎలా సృష్టించబడింది. మనిషి పుట్టుక గురించి పూర్తిగా తెలుసుకున్నారు. దీంతో లెఫ్ట్ కమ్యూనిస్టు రాజకీయాలకు ఆకర్షితులై ఇంటర్, డిగ్రీలలో ఎస్ఎఫ్ఐ డివిజనల్ వరకు వెళ్లారు. అనంతరం వీటి అనుబంధ సంస్థ అయినటువంటి సీపీఎంలో చేరారు. కమ్యూనిస్టు నాయకుడిగా వ్యవసాయ కార్మికులకు కూలీ రేట్లు పెంచేలా పోరాటం సాగించారు. 1984లో భూమి కొంతమంది చేతుల్లో ఉండేది.. ఎక్కువమంది కూలీలు ఉండేవారు. దీంతో జూన్, జూలై నెలల్లో గ్రామాల్లోకి వెళ్లడం కూలీలను జమ చేయడంచ కూలి సంఘాలను ఏర్పాటు చేసి కూలీ రేట్లు పెంచడం కోసం పోరాటాలు, సభలు నిర్వహించి రైతుల్లో చైతన్యం నింపేవారు. భూస్వాముల మిగులు భూములను పంచాలని ఆర్డీవో, కలెక్టర్లకు ఫిర్యాదులు చేయడం, ధర్నాలకు జనాలను సమీకరించే వారు. ఇల్లు లేని నిరుపేదల పక్షాన నిలబడి ప్రభుత్వ భూములలో గుడిసెలు వేయించేవారు.

## విద్యాభ్యాసం..

ఎనగందుల మురళిది ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసం స్వగ్రామం కొండాపురంలో కొనసాగింది. ఇంటర్, డిగ్రీ నెల్లికుదురు ప్రభుత్వ కళాశాలలో చదివారు. చదువుకునే సమయంలో విద్యార్థి సంఘాల నాయకుడిగా విద్యార్థుల సమస్యల పరిష్కారంలో క్రీయాశీలక పాత్ర పోషించారు. పదవ తరగతి అనంతరం 1985-86లో ఎస్ఎఫ్ఐలో చేరారు. అనంతరం డీవైఎఫ్ఐ నెల్లికుదురు మండల ప్రెసిడెంట్ గా, జీతగాండ్ల సంఘం వర్ధన్నపేట నియోజకవర్గం కన్వీనర్ గా, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాయపర్తి మండల కన్వీనర్ గా పనిచేశారు.

## కాంగ్రెస్ లో చేరిక...

కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల్లో కమ్యూనిస్టుల బలం తగ్గిపోయింది. అప్పటి పరిస్థితుల్లో ఎన్నికల పోటీని కమ్యూనిస్టు పార్టీలు ఎదుర్కొనే పరిస్థితి లేకుండా పోయింది. అవతలి పార్టీ వాళ్లు ఎలక్షన్లలో డబ్బులు పంచడంతో వామపక్షపార్టీల నాయకులు ఓడిపోవడం తద్వారా కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గుతూ వచ్చింది. 1986 నుండి 99 వరకు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగిన ఎనగందుల మురళి అనంతరం 1999లో ఎర్రబెల్లి స్వర్ణ–వరద రాజేశ్వరరావులు కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడంతో ఆయన ఆ పార్టీ లో చేరారు.

## సర్పంచిగా ప్రస్థానం..

ఎనగందుల మురళి 2006లో పోటీ చేసి కొండాపురం సర్పంచిగా గెలిచి 2011 వరకు పనిచేశారు. అప్పటి పరిస్థితుల్లో స్థానికంగా ఎమ్మెల్యే దయాకర్ రావు టీడీపీ తరుపున ఉన్నారు. రాష్ట్రంలో అధికారంలో మాత్రం కాంగ్రెస్ ఉన్నా.. స్థానిక ఎమ్మెల్యే సొంత పార్టీకి చెందిన వారు కాకపోడంతో అభివృద్ధి పనులకు నిధులు ఇచ్చే పరిస్థితి ఉండేది కాదు. అయినప్పటికీ తను జీపీ నిధులను సక్రమంగా వినియోగించి గ్రామ అభివృద్ధికి పాటుపడ్డారు. కొండాపురం గ్రామాన్ని ఇందిరమ్మ గ్రామంగా తీర్చిదిద్దారు. గ్రామంలోని పాఠశాలలో మూడు గదులు నియమించారు. రెండు కిచెన్ గదులు వెటర్నరీ హాస్పిటల్ సైడ్ కాలువలు జిపి కాంపౌండ్ సైడ్ కాలువలు పెండింగ్ పైపు లైన్స్ సిసి రోడ్లు ఎంపీ నిధుల ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది వీటి కొరకు గ్రామంలో బోర్లు వేయడం. మంచినీటి బావుల కోసం ట్రాన్స్ ఫార్మర్ దానికి గాను, లైన్స్ బోర్లకు కరెంటు లైన్లు కుంటలకు చెరువులకు తూములు గేట్ల నిర్మాణం, ఈజీఎస్ వర్క్, కాలువలు, చెరువుల్లో పూడిక తొలగింపు తద్వారా వచ్చిన రాగడి మట్టిని రైతులకు ఉచితంగా అందించడం లాంటి పనులు చేసి గ్రామ ప్రజల మన్ననలు పొందారు.

## ప్రజా జీవితమే లక్ష్యం..

కాంగ్రెస్ పార్టీలోనే చివరి వరకు కొనసాగుతానని ఎనగందుల మురళి చెబుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పక్షాన ఉంటూ తన వంతు బాధ్యతగా ప్రజా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. భవిష్యత్తులో స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పార్టీ అధినాయకురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు పోటీ చేసే అవకాశం వస్తే జడ్పీటీసీ, ఎంపీటీసీగా పోటీలో నిలబడతానని స్పష్టం చేశారు. ప్రజా సేవే తన జీవిత పరమావధిగా ఎనగందుల మురళి ముందుకు సాగుతానంటున్నారు.

## నేటితరం రాజకీయం మారాలి..

గత రాజకీయాలకు ఇప్పటి రాజకీయాలకు చాలా తేడా ఉంది. గతంలో రాజకీయాలు చేసేవారు.. కార్యకర్తలు, నాయకులు అంటూ తేడా ఉండేది కాదు.. ఇప్పుడు తేడా వచ్చింది. గతంలో పార్టీ అంటే దాని సిద్ధాంతాలను నమ్ముకొని నాయకుడిపై గౌరవంతో అందులోనే అంటిపెట్టుకొని ఉండేవాళ్లు. కానీ, ఇప్పటి పరిస్థితుల్లో అవకాశవాద రాజకీయాలకు అలవాటు పడిపోయారు. డబ్బు ఎక్కడ ఉంటే అందులోనే రాజకీయాలు చేయడంతో స్వార్ధపూరిత రాజకీయాలకు అలవాటు పడిపోతున్నారు. అలా వ్యవహరించే నాయకులకు ప్రస్తుత ఆనందం తప్ప శాశ్వత ఆనందం ఉండదు. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పని చేయాలి.. సిద్ధాంతాన్ని స్టడీ చేయాలి.. అందులోనే కొనసాగాలని నేటి తరం నాయకులకు మురళి సూచిస్తున్నారు. ఏదేమైనా అధికారం ఉన్న లేకున్నా ఒకే పార్టీని అంటిపెట్టుకొని సిద్ధాంతానికి లోనై నడుచుకోవాలంటున్నారు.

## వరించిన పదవులు..

ఎనగందుల మురళి పీఏసీఎస్ డైరెక్టర్ గా ఐదేళ్లు, కొండాపురం వార్డు మెంబర్ గా ఐదేళ్లు, సర్పంచ్ గా ఐదేళ్లు, రెండు దఫాలు వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా పనిచేశారు. నాయి బ్రాహ్మణ సంఘం తరపున ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారిగా, జనరల్ సెక్రటరీగా కొనసాగారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా, లయన్స్ క్లబ్ వర్ధన్నపేట ట్రెజరీ వైస్ ప్రెసిడెంట్, ట్రెజరీ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, బ్రాయిలర్ ఫార్మర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ప్రస్తుతం పని చేస్తున్నారు. నోపా (నాయీబ్రాహ్మణ అఫిషల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మహబూబాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు.

### బయోడేటా

**పేరు - ఎనగందుల మురళి**
**వృత్తి- వ్యవసాయం**
**పుట్టిన తేదీ- 11-01-1969**
**విద్యార్హతలు-డిగ్రీ-బీఏ**
**తల్లిదండ్రులు : చంద్రయ్య- భారతమ్మ .**
**భార్య- పుష్పలీల**
**పిల్లలు-రంజిత్, భరత్, సందీప్**
**చిరునామా- గ్రామం- కొండాపురం, మండలం- రాయపర్తి, జిల్లా వరంగల్**










# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా..

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అట్టహాసంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం
- కాంపౌండ్ నిర్మాణానికి శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు తాను కట్టుబడి ఉన్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. నిరంతరం అందరికీ అందుబాటులో ఉంటూ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్-2024 ముగింపు కార్యక్రమం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాజీ మేయర్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా సమాజంలో జరుగుతున్న లోటుపాట్లను సరిదిద్దేందుకు నిరంతరం పనిచేస్తుందని గుర్తు చేశారు. అన్ని రంగాలతో పాటుగా మీడియాలో కూడా ఒక్కోసారి వింత పోకడలు చూస్తున్నామని.. అలాంటి వాటిని సరిదిద్దుకుంటూ ముందుకెళ్లడమే ప్రస్తుతం మన ముందున్న కర్తవ్యం అన్నారు. తాను 30 ఏళ్లుగా రాజకీయాల్లో రాణిస్తున్నానంటే అందుకు జర్నలిస్టుల సహకారం సంపూర్ణంగా ఉండటమే కారణమన్నారు. మరో అతిథి ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. తాను మేయర్ గా ఉన్న సమయంలో జర్నలిస్టులకు సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రకాష్ రెడ్డి పేటలో ఇందిరమ్మ కాలనీ పేరిట ఒక కాలనీని ఏర్పాటు చేసి అందులో ఆ రోజుకు వర్కింగ్ లో ఉన్న జర్నలిస్టులందరికీ బీపీఎల్ కింద ఇంటి స్థలాన్ని అందించామన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ... ప్రెస్ క్లబ్ అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉంటాయని.. క్లబ్బు ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాజీపేట మీడియా పాయింటుకు సొంత భవన నిర్మాణం కోసం 500 గజాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి సాయం అందించాలని కోరారు. జర్నలిస్టుల చిరకాల కోరిక సొంతింటి స్థలం అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే నాయినికి విజ్ఞప్తి చేశారు. ప్రెస్ క్లబ్ కు బొడ్రాయి లాంటివాడని.. తమకు ఏ సమస్య వచ్చినా ఎంఎల్ఏ తలుపు తడదామని ఈ సందర్భంగా చెప్పారు. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం కోసం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కృషి చేస్తుందని ఈ సందర్భంగా అధ్యక్షులు వేముల నాగరాజు గుర్తు చేశారు. స్పోర్ట్స్ మీట్ లో భాగంగా విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కళాకారుల ఆటపాటలు హైలెట్ గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, టీయూడబ్ల్యూజే-హెచ్143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, టీబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, టీయూడబ్ల్యూజే ఐజేయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, కార్యదర్శి తోట సుధాకర్, వరంగల్ జిల్లా కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, టీయూడబ్ల్యూజే హెచ్ 143 హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మెండు రవీందర్, కార్యదర్శి ఉమేందర్, ఐజేయూ యూనియన్ రాష్ట్ర హౌసింగ్ అండ్ వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పీవీ.మదన్ మోహన్, పిన్నా శివకుమార్, గడ్డం కేశవమూర్తి, ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్లు గోకారం శ్యామ్, బొడిగె శ్రీను, కోడిపెల్లి దుర్గాప్రసాద్ రావు, అల్లం రాజేష్ వర్మ, యాంసాని శ్రీనివాస్, సహాయ కార్యదర్శిలు సంపేట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, వలిశెట్టి సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, కార్యవర్గ సభ్యులు దొమ్మటి శ్రీకాంత్, జనగాని ఆంజనేయులు, ఎండి. నయీం పాషా, కమటం వేణుగోపాల్, గుండెబోయిన దిలీప్ కుమార్, కందుకూరి సంజీవ్, డాక్టర్ నన్నపనేని భరత్ కుమార్, మంచాల రాజు, బాలవారి విజయ్ రాజ్, సీనియర్ జర్నలిస్టులు సంగోజు రవి, కంకణాల సంతోష్, పెండెం వేణుమాధవ్, గుంటి విద్యాసాగర్, ముగ్ధం, కొండం రవీందర్ రెడ్డి, మ్యాడం రజినీకుమార్, పొగాకుల అశోక్, పెద్దీష్, కృష్ణమోహన్, ప్రశాంత్, వెంకటరత్నం, రంజిత్, డెస్క్ జర్నలిస్ట్ నేతలు వర్దెల్లి లింగయ్య, సోమనర్సయ్య, మైదం సుధాకర్, జర్నలిస్టులు చెరుకు వేణుప్రసాద్, పబ్బు సతీష్, వేణు, తిరుపతి, తోట తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ బ్యాస్ట్ మెన్ గా మైదం సుధాకర్..

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ లో క్రికెట్ విభాగంలో అత్యున్నత ప్రతిభ కనబర్చిన ఆంధ్రజ్యోతి డెస్క్ ఇంచార్జి మైదం సుధాకర్ బెస్ట్ బ్యాస్ట్ మెన్, ఫాస్టెస్ట్ సెంచరీ అవార్డును సొంతం చేసుకున్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన స్పోర్ట్ మీట్ ముగింపు కార్యక్రమంలో సుధాకర్ కు షీల్డ్ ను అందజేశారు.








## పుష్పా-2 దర్శకుడు, నిర్మాతలు, హీరోపై..

# తక్షణం కేసులు నమోదు చేయండి

- వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి
- హనుమకొండ ఇన్ స్పెక్టర్ సతీష్ కు వినతి
- సీఎం, సీపీలకు ఉత్తరం పోస్ట్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మైత్రి మూవీ మేకర్స్ సారధ్యంలో దర్శకుడు సుకుమార్ నిర్మించిన పుష్పా-2 చిత్రం పూర్తిగా నేర ప్రవృత్తిని పెంచి పోషించే విధంగా ఉన్నదని వరంగల్ వాయిస్ ఎడిటర్, రాష్ట్ర విశిష్ఠ అవార్డు గ్రహీత గడ్డం కేశవమూర్తి ఆరోపించారు. ఈ మేరకు సినీ దర్శకుడు, నిర్మాతలు, హీరోపై తక్షణం కేసులు నమోదు చేయాలని కోరుతూ హనుమకొండ ఇన్ స్పెక్టర్ సతీష్ కు గురువారం వరంగల్ వాయిస్ జర్నలిస్ట్ సిద్దోజు రాకేష్ తో కలిసి వినతి పత్రం అందజేశారు. దీని కాపీని ముఖ్యమంత్రి, వరంగల్ సీపీలకు పోస్ట్ ద్వారా పంపించారు. లేక పూర్తి సారాంశం ఈ విధంగా ఉంది..

'మైత్రి మూవీ మేకర్స్ సారధ్యంలో దర్శకుడు సుకుమార్ నిర్మించిన పుష్పా 2 చిత్రం పూర్తిగా నేర ప్రవృత్తిని పెంచి పోషించే విధంగా ఉన్నది. సమాజహితం కోరుతూ సామాజిక అంశాలను తీసుకుని ఈ సినిమా నిర్మించలేదు. అంతా మోసపు పన్నివేశాలే ఇందులో ఉన్నాయి. ఒక స్మగ్లర్ వ్యవస్థను శాసించినట్లుగా ఉన్నది. ఈ సినిమాలో ఆ కలప స్మగ్లర్ ను హీరోగా చూపారు. నేరాలు, ఘోరాలను నియంత్రిస్తూ శాంతి భద్రతలను పరిరక్షిస్తున్న పోలీస్ వ్యవస్థను ఇందులో విలన్ గా చూపించారు. అలాగే ముఖ్యమంత్రి పదవిని డబ్బులతో కొనవచ్చునని.. ఎమ్మెల్యేలందరినీ లంచావతారులుగా చిత్రీకరించారు. ఒక స్మగ్లర్ తలుచుకుంటే ప్రజాప్రతినిధులంతా అతని కాళ్ల వద్ద మోకరిల్లుతారనే చందంగా ప్రజాస్వామ్య వ్యవస్థను ఇందులో కించపరిచారు. బాధ్యతాయుత స్థాయిలో నిక్కచ్చితంగా ఉండే ఓ పోలీస్ అధికారిని అవహేళన చేయడం బాధించిందని ఆ లేఖలో పేర్కొన్నారు.

మన సంప్రాదాయాలు, ఆచారాలు మంటకలిపే విధంగా కథానాయికతోపాటు, ఐటెం సాంగ్ డ్యాన్స్ చేసిన నటిని పూర్తి సెక్సీగా తెరపై చూపారు. అర్థత, కళాత్మకత కలగలిపిన దృశ్యకావ్యాలు ఇందులో లేవు. అద్యంతం ఫైటింగ్ లు.. అశ్లీలత తప్ప సామాజిక విషయాలేవీ తెరపైన చూపలేదు. సందేశాత్మకంగా, సమాజాన్ని సన్మార్గంలో నడిపించేలా లేదు. సామాజిక స్పృహ గురించి పేర్కొనలేదు. ఒక పోలీస్ అధికారి బట్టలు ఇప్పి నిలబెట్టడం.. వాహనాన్ని ఢీ కొట్టి అతను నీటిలో పడిపోగానే అందులో సినిమా హీరో అర్జున్ మూత్రం పోయడం పోలీసు వ్యవస్థను కించపరిచేదిగా ఉందన్నారు. స్మగర్ నుహీరో చేసి పోలీసులను విలన్ గా చూపారు. ఇది సమాజాన్ని పెడద్రోవ పట్టించేదిగా ఉంది. 2024 డిసెంబర్ 4న హైదరాబాద్ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సంధ్య థియేటర్ లో నిర్వహించిన ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళా చనిపోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న ఘటనపై రాష్ట్ర పోలీస్ యంత్రాంగం చక్కగా స్పందించింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 18 మందిపై కేసులు నమోదు చేసి హీరో అల్లు అర్జున్ ను 11వ నిందితుడిగా చేర్చడం సంతోషదాయకమే! ఈ విషయంలో రాష్ట్ర పోలీస్ శాఖ చర్యలు బేష్ గా ఉన్నాయి.

మొత్తానికి సినిమాలు సమాజాన్ని సన్మార్గంలో నడిపించేలా ఉండాలి. మంచి సందేశంతో చిత్రాలు నిర్మించాలి. కానీ, మొత్తం నేరాలు, ఘోరాలతోపాటు, నేరప్రవృత్తిని ప్రోత్సహించే విధంగా పుష్పా-2 సినిమా తీసిన దర్శకుడు సుకుమార్, నిర్మాతలు మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు యెలమంచిలి రవిశంకర్, యేర్నేని నవీన్, ఎగ్జిక్యూటీవ్ నిర్మాత బండ్రెడ్డి అశోక్, సినిమా హీరో అల్లు అర్జున్ పై తక్షణమే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఇద్దరు ఎస్సైల బదిలీ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ గురువారం సీపీ అంబర్ కిషోర్ ఝూ ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషన్ బ్రాంచ్ ఎస్సైగా పని చేస్తున్న బి.మాధవ్ తో పాటు, ఏనుమాముల పోలీస్ స్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న పి.శ్రీకాంత్ లను హనుమకొండ పోలీస్ డివిజన్ పరిధిలోని కేయూసీ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు. వెంటనే తమ విధుల్లో చేరాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com